సాక్షి
మంచిర్యాల
సోమవారం, 20, నవంబర్, 2023



నోటాపై నొక్కుతున్నారు!

అభ్యర్థులకు ఓటు వేసేందుకు ఇష్టపడనివారి కోసం.. ఈవీఎంలో నోటా ఆప్షన్ చేర్చారు. 2014, 2018 అసెంబ్లీ ఎన్నికల్లో చాలామంది నోటాను వినియోగించుకున్నారు. 10లో▸



స్వతంత్రుల ప్రభావమెంత..?

జిల్లాలోని స్వతంత్ర అభ్యర్థులూ భారీగానే బరిలో ఉన్నారు. ఏ రాజకీయ పార్టీ అభ్యర్థికి ఎంత మేరకు ఓట్లు గండికొట్టే అవకాశాలు ఉన్నాయనే ఆసక్తికరమైన చర్చ సాగుతోంది. 10లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
33.3 /21.0

ఆకాశంలో కొంతమేర మేఘాలు ఉంటాయి. వాతావరణం పొడిగా ఉటుంది. పగటి ఉష్ణోగ్రతలు సాధారణంగా నమోదవుతాయి. రాత్రి చలి ప్రభావం పెరుగుతుంది.

న్యూస్‌రీల్

చెక్ పోస్టును తనిఖీ చేసిన అబ్జర్వర్



రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న అబ్జర్వర్

చెన్నూర్‌రూరల్: ఎన్నికల నేపథ్యంలో మండలంలోని సుందరశాల గ్రామ సమీపంలోని అన్నారం బ్యారేజీ వద్ద ఏర్పాటు చేసిన చెక్ పోస్టును నియోజకవర్గ అబ్జర్వర్ సజ్జన్ రాజశేఖర్ ఆదివారం తనిఖీ చేశారు. ఇతర జిల్లాల నుంచి వచ్చే వాహనాలను తనిఖీ చేయాలని సూచించారు. వివరాలు నమోదు చేసిన రిజిస్టర్‌ను పరిశీలించారు. బ్యారేజీ మీదుగా వెళ్లే, వచ్చే వాహనాలను తప్పని సరిగా చెక్ చేయాలని ఆదేశించారు. ఆయన వెంట సీఐ వాసుదేవరావు ఉన్నారు.

22, 23 తేదీల్లో తైక్వాండో ఎంపిక పోటీలు

మంచిర్యాలఅర్బన్: స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 22న మంచిర్యాల సెవెన్ హిల్స్ స్కూల్‌లో అండర్-14, 17 బాలబాలికల తైక్వాండో ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ కార్యదర్శి పరిమిళ తెలిపారు. అర్హత, ఆసక్తి ఉన్న క్రీడాకారులు సంబంధిత ధ్రువపత్రాలతో కన్వీనర్ భాగ్యలక్ష్మిని సంప్రదించాలన్నారు. 23న అండర్-14, 17 జిల్లా స్థాయి అథ్లెటిక్ పోటీలు చెన్నూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరుగుతాయన్నారు. అదే రోజు ఉదయం 8:30 బోనఫైడ్, ఆధార్‌తోపాటు పలు ధృవపత్రాలతో ఎస్‌ఏపీడీ ని సంప్రదించాలని తెలిపారు. ప్రతీ పాఠశాల నుంచి ప్రతీ ఈవెంట్‌కు ఇద్దరు మాత్రమే పాల్గొనాలని సూచించారు.

కాసిపేటలో ఓయూ విద్యార్థుల ప్రచారం



ప్రచారం నిర్వహిస్తున్న ఓయూ విద్యార్థులు

కాసిపేట: మండల కేంద్రంలో ఓయూ విద్యార్థులు కాంగ్రెస్ తరఫున ఇంటింటా ప్రచారం నిర్వహించారు. నిరుద్యోగుల జీవితాలను సర్వనాశనం చేస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దించాలని, పోరాడి తెచ్చుకున్న తెలంగాణలో కుటుంబ పాలనను యువత వ్యతిరేకించాలని కోరారు. తల్లిదండ్రులు కేసీఆర్ పింఛన్ మాటలు నమ్మకుండా కాంగ్రెస్ పార్టీని గెలిపించాల ని కోరారు. ఓయూ జేఏసీ విద్యార్థులు గణేశ్, కబీర్‌దాస్, విష్ణు, లోకేష్, మనోజ్, సాయినాథ్, సాయికిరణ్, కిషోర్, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మాట తప్పిన ఎమ్మెల్యేను ఓడిస్తాం



మాట్లాడుతున్న మాల మహానాడు నాయకులు

బెల్లంపల్లి: మాలలకు మాట ఇచ్చి తప్పిన బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్యను అసెంబ్లీ ఎన్నికల్లో చిత్తుగా ఓడిస్తామని తెలంగాణ మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు కుంబాల రాజేశ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసర్ల యాదగిరి తెలిపారు. బెల్లంపల్లి ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం మాట్లాడారు. మాల భవన్ నిర్మాణానికి రూ.10 లక్షలు ఇస్తానని హామీ ఇచ్చి గత ఎన్నికల్లో ఓట్లు వేయించుకున్న చిన్నయ్య ఎమ్మెల్యే అయ్యాక విస్మరించారని అన్నారు. ఇచ్చిన మాట తప్పి చిన్నయ్య మాలలను వంచించారని పేర్కొన్నారు. నియోజకవర్గంలో 32 వేల మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. ఎన్నికల్లో గెలిచాక మాల భవన్ నిర్మాణానికి నిధులు కేటాయిస్తానని కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వినోద్ మాట ఇచ్చారని, ఈసారి ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి వినోద్‌కు ఓటువేసి గెలిపించాలని కోరారు. సమావేశంలో మాల మహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎరుకల శ్రీనివాస్, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు దాసరి విజయ, నాయకులు దాసరి ప్రతాప్, ప్రదీప్‌కుమార్, పెద్ద యాదగిరి, సమ్మయ్య, లింగాల అమృత, ఆసాది మురళి, కొమురయ్య, రాజశేఖర్, పోశం తదితరులు పాల్గొన్నారు.

పార్టీ మారే... పదవి వరించే

రాజకీయాల్లో కొంతమంది నాయకులు ఎంతగా ప్రయత్నించినా ఏళ్లుగా పదవి దక్కకుండా దురదృష్టవంతులుగా నిలిస్తే మరి కొంతమంది దురదృష్టాన్ని తమ అదృష్టంగా మార్చుకుని అందలమెక్కుతారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఇలాంటి కోవకే చెందిన నాయకులున్నారు. 10లో▸

ఇందిరమ్మ రాజ్యం తెస్తాం



ఖానాపూర్ సభలో ప్రసంగిస్తున్న ప్రియాంకాగాంధీ, వేదికపై కాంగ్రెస్ ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రే, అభ్యర్థులు వెడ్మ బొజ్జు పటేల్, కూచాడి శ్రీహరిరావు, ఆడె గజేందర్



అభివాదం చేస్తున్న ప్రియాంకాగాంధీ



ఖానాపూర్ బహిరంగ సభకు హాజరైన కాంగ్రెస్ శ్రేణులు, ప్రజలు



నృత్యం చేస్తున్న గిరిజన మహిళ

- ఇది భీమ్, రాంజీ వీరుల భూమి
- 'జల్ జంగల్ జమీన్' పోరుగడ్డ ఇది
- భూపట్టాలిచ్చాం.. ఐటీడీఏలు పెట్టాం
- ఆదివాసీలకు ఇందిరమ్మ ఎన్నో చేసింది
- బీఆర్ఎస్, బీజేపీ ఏంచేశాయో అడగండి
- ఖానాపూర్, ఆసిఫాబాద్ సభల్లో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకాగాంధీ
- సభల సక్సెస్‌తో కాంగ్రెస్ శ్రేణుల్లో జోష్

నిర్మల్/ఖానాపూర్/సాక్షి, ఆసిఫాబాద్: 'కుమురం భీమ్, రాంజీగోండు, సమ్మక్క–సారలమ్మ లాంటి వీరుల భూమి ఇది. జల్ జంగల్ జమీన్ కోసం పోరాడిన గడ్డ ఇది. ఆదివాసులది ప్రపంచంలోనే గొప్ప సంస్కృతి. గిరిజన బిడ్డల కోసం ఇందిరమ్మ ఎన్నో చేసింది. అందుకే 40 ఏళ్లయినా దేశంలో ఏ మారుమూల గ్రామానికి వెళ్లినా తనను గుర్తుచేస్తుంటారు.. కాంగ్రెస్‌ను గెలిపిస్తే.. తెలంగాణలో ఇందిరమ్మ రాజ్యం తెస్తాం' అని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకాగాంధీ అన్నారు. నిర్మల్ జిల్లా ఖానాపూర్, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో ఆదివారం వేర్వేరుగా ఎన్నికల ప్రచార సభలు నిర్వహించారు. ఖానాపూర్‌లో పార్టీ అభ్యర్థి వెడ్మ బొజ్జుపటేల్ తరఫున, ఆసిఫాబాద్‌లో అభ్యర్థి శ్యాంనాయక్ తరఫున ప్రచారం చేశారు. ఆదివాసీ నేతలైన బొజ్జుపటేల్, శ్యాం నాయక్‌ను గెలిపించాలని కోరారు. రెండు సభలు సక్సెస్ కావడంతో కాంగ్రెస్ శ్రేణుల్లో జోష్ కనిపించింది.

భూమి పట్టాలు, ఐటీడీఏలు..

ఆదివాసీలు, గిరిజన బిడ్డల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నో చేసిందని, ఇక ముందూ సంక్షేమ ఫలాలు అందిస్తుందని ప్రియాంకాగాంధీ తెలిపారు. తన నానమ్మకు ఆదివాసీలంటే చాలా ఇష్టమని, వారికోసం చాలా కార్యక్రమాలు చేపట్టారని వివరించారు. భూములపై హక్కులు, పట్టాలు, పక్కా ఇళ్లు ఇచ్చారన్నారు. గిరిజనుల సంపూర్ణ వికాసం, అభివృద్ధి కోసం ఐటీడీఏలను ఏర్పాటు చేశారని చెప్పారు. ఇందిరమ్మ పుట్టిన రోజునే ఇలా ఆదివాసీలను కలుసుకోవడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు.

విజన్‌తో అభివృద్ధి చేస్తాం

పదేళ్లపాటు రాష్ట్రాన్ని పాలించిన కేసీఆర్ ప్రజల కలలను ఒక్కొక్కటిగా నాశనం చేస్తూ వచ్చారని ప్రియాంకాగాంధీ ఆరోపించారు. యువతకు ఉద్యోగాలు, రైతులకు రుణమాఫీ, మహిళలకు సంక్షేమ ఫలాలు ఇవ్వలేదని విమర్శించారు. పథకాలు, అభివృద్ధి పేరిట చేపట్టిన పనుల్లో రూ.కోట్లు దోచుకున్నారని, అన్నింట్లో అవినీతి పెరిగిపోయిందని ఆరోపించారు. కాంగ్రెస్‌ను గెలిపిస్తే ముందుచూపుతో ప్రజల అభివృద్ధికి కృషిచేస్తామని తెలిపారు. ఇందులో భాగంగానే ఆరు గ్యారంటీలను తీసుకువచ్చామని చెప్పారు. ఓటు కోసం వచ్చే బీఆర్ఎస్, బీజేపీ ఏం చేశాయో నిలదీయాలని పిలుపునిచ్చారు. ఖానాపూర్ అభ్యర్థి వెడ్మ బొజ్జుపటేల్, నిర్మల్ అభ్యర్థి శ్రీహరిరావు, బోథ్ అభ్యర్థి ఆడె గజేందర్, ఆదిలాబాద్ అభ్యర్థి కంది శ్రీనివాస్‌రెడ్డిని వేదికపై చూపిస్తూ వారిని గెలిపించాలని కోరారు.

గెలిపిస్తారనే నమ్మకంతో ఉన్నం..

'ఎకరం 38 గుంటల భూమి మాత్రమే ఉన్న పేదోడిని.. ఇప్పటికీ ఇందిరమ్మ ఇంట్లోనే ఉంటున్న. తెలంగాణ ఇచ్చిన సోనియమ్మ బిడ్డ నాకోసం ఖానాపూర్ గడ్డకు రావడం చాలా అదృష్టంగా భావిస్తున్న. ఈ పేదోడికి ఒక్క అవకాశమిచ్చి గెలిపించండి. ఖానాపూర్ నియోజకవర్గంలో 33 ఏళ్లగా కాంగ్రెస్ గెలుపు కోసం పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజలపై నమ్మకంతో ఉన్నారు. మా నమ్మకాన్ని నిలబెట్టాలని కోరుతున్న..' అంటూ ఖానాపూర్ కాంగ్రెస్ అభ్యర్థి వెడ్మ బొజ్జుపటేల్ అభ్యర్థించారు. వైఎస్సార్ హయాంలో ఖానాపూర్, కడెం మండలాల రైతుల చిరకాల స్వప్నం సదర్మాట్ బ్యారేజీని మంజూరు చేస్తే, బీఆర్ఎస్ పాలనలో నిర్మల్ ప్రాంతానికి తరలించినా నేటికీ పూర్తి చేయలేదన్నారు. కడెం ప్రాజెక్ట్‌కు కనీసం మరమ్మతు చేయించలేని స్థితిలో ప్రభుత్వం ఉందని ఆరోపించారు. స్థానికేతరుడిని, తన బినామీతో కేటీఆర్ పోటీ చేయిస్తున్నారని, ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు.



ప్రజలకు నమస్కరిస్తున్న వెడ్మ బొజ్జు పటేల్ →

ఆకట్టుకున్న ప్రసంగం

ఆసిఫాబాద్ సభలో ప్రియాంకాగాంధీ ప్రపంచ కప్ క్రికెట్ గురించి మాట్లాడటంతో సభలో హర్షధ్వానాలు వ్యక్తమయ్యాయి. ఇండియా కచ్చితంగా గెలుస్తుందని.. 1983లో ఇండియా ప్రపంచ కప్ గెలుచుకున్న సందర్భంలో తన నానమ్మ ఇందిరాగాంధీ టీం సభ్యులకు ఇచ్చిన విందు గురించి తనకు గుర్తుందని అప్పటి జ్ఞాపకాలు నెమరు వేసుకున్నారు. ఆమె ప్రసంగాన్ని తెలుగులో అనువాదం చేయడానికి కాంగ్రెస్ నేత ఒకరు సిద్ధమవుతుండగా.. ప్రియాంక 'అనువాదం కావాలా.. హిందీలో ప్రసంగం కొనసాగించనా..' అని అడగ్గా.. ప్రజలు తెలుగులో అనువాదం కావాలని కోరారు. దీంతో ఆమె తెలుగు అనువాదానికి అంగీకరించి ప్రసంగం కొనసాగించారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక యువత, అక్కచెల్లెమ్మలు పడుతున్న కష్టాల గురించి చెబుతూ.. 'కేసీఆర్ హయాంలో యువతకు ఉపాధి దొరికిందా? అక్కచెల్లెమ్మల పురోగతికి ప్రభుత్వం పనిచేసిందా?' అని ప్రియాంక సభికులను ప్రశ్నించగా.. అందరూ ముక్తకంఠంతో లేదు.. లేదు.. అని సమాధానం ఇవ్వడం కనిపించింది. దాదాపు 50 నిమిషాల పాటు ఆమె ప్రసంగం కొనసాగింది. ఆయా సభల్లో మహారాష్ట్ర మాజీ సీఎం అశోక్‌రావుచవాన్, తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావు ఠాక్రే, ఏఐసీసీ కార్యదర్శి, తెలంగాణ జోనల్ ఇన్‌చార్జి విష్ణునాథ్, ఖానాపూర్ పరిశీలకుడు ప్రజ్ఞానంద్ ఖర్సె, ఏఐసీసీ సెక్రటరీ రోహిత్ చౌదరి, ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్, రాజురా ఎమ్మెల్యే సుభాష్ దోటే, కర్ణాటక ఎమ్మెల్సీ ప్రకాశ్‌రాథోడ్, మాజీ ఎమ్మెల్సీ రాజయ్య, సిర్పూర్ ఎమ్మెల్యే అభ్యర్థి రావి శ్రీనివాస్, నిర్మల్ బోథ్, ఆదిలాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థులు కూచాడి శ్రీహరిరావు, ఆడె గజేందర్, కంది శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు గుండా శ్యాం, మంగ, గణేశ్, అనిల్ గౌడ్, మునీర్, ఆసిఫ్, సత్తు మల్లేశ్, పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, దయానంద్, చిన్నం సత్యం, షబ్బీర్‌పాషా, నిమ్మల రమేశ్, సతీశ్‌రెడ్డి, దుర్గాభవాని, జహీర్ హైమద్, మజీద్, గుగ్లావత్ రాజు, జంగిలి శంకర్, గంగనర్సయ్య, సలీంఖాన్, సీపీఐ నాయకులు బద్రి సత్యనారాయణ, భోగే ఉపేందర్, అల్లూరి లోకేశ్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సభ సైడ్‌లైట్స్

- ఖానాపూర్ మండలం మస్కాపూర్ శివారులో ఆదివారం నిర్వహించిన కాంగ్రెస్ సభ కారణంగా ఖానాపూర్–మెట్‌పల్లి రోడ్డు పూర్తిగా జనంతో నిండిపోయింది.
- మధ్యాహ్నం 12.20కి సభ ప్రాంతానికి ప్రియాంకాగాంధీ హెలిక్యాప్టర్‌లో వచ్చారు. సుమారు అరగంటకుపైగా వేదికపై ప్రసంగించి తిరిగి 1.15గంటలకు ఖానాపూర్ నుంచి ఆసిఫాబాద్ సభలో పాల్గొనేందుకు హెలిక్యాప్టర్‌లో వెళ్లిపోయారు.
- సభ ప్రాంగణానికి వచ్చే పార్టీ ప్రముఖులతో పాటు ప్రజలకు ఆదివాసీలు గుస్సాడీ నృత్యాలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా బంజారా మహిళలు కూడా సంప్రదాయ దుస్తులతో సభా ప్రాంగణానికి చేరుకుని నృత్యం చేశారు.
- హెలిప్యాడ్‌ను సభకు సమీపంలో ఏర్పాటు చేయగా అది వచ్చిపోయిన సమయంలో లేచిన దుమ్ముతో ప్రజలు కాసేపు ఇబ్బంది పడాల్సి వచ్చింది.
- హెలిప్యాడ్ వద్దకు పార్టీ ఖానాపూర్ ఎమ్మెల్యే అభ్యర్థి వెడ్మ బొజ్జుతో పాటు ముఖ్య నాయకులు వెళ్లి ప్రియాంకాగాంధీకి పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు.
- సభ ప్రారంభానికి ముందు వేదికపై కళాకారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రజలను ఎంతగానో అలరించాయి. ఈ సందర్భంగా మధ్యమధ్యలో స్థానిక నేతల ప్రసంగాలు కొనసాగాయి.
- సభ జరుగుతున్న సమయంలో ఎండలో ఇబ్బంది పడే వారికి వలంటీర్లు వాటర్ ప్యాకెట్లు అందజేశారు.
- పోలీస్ అధికారులు, సిబ్బంది సభకు హాజరై ప్రజలతో పాటు రోడ్డుపై ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీ చర్యలు చేపట్టారు. – ఖానాపూర్

ఖాళీ జాగాపై కన్ను!



జిల్లా కేంద్రంలోని రాజీవ్‌నగర్‌లో చదును చేసిన ప్రభుత్వ భూమి



ఎడ్లవాడలో గతంలో ఉన్న ప్రభుత్వ బావి(ఫైల్)



ఎడ్లవాడలోని బావిని చదును చేసిన దృశ్యం

- ఎన్నికల వేళ ప్రభుత్వ భూముల ఆక్రమణ
- అదును చూసి చదును చేస్తున్న కబ్జా రాయుళ్లు
- రక్షణ కల్పించకుంటే భూములు మాయం

మంచిర్యాలటౌన్: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో అధికారులు ఎన్నికల విధుల్లో బిజీగా ఉన్నారు. మరోవైపు ప్రజాప్రతినిధులు ఎన్నికల ప్రచారంలో బిజీగా ఉన్నారు. దీంతో కబ్జారాయుళ్లు ప్రభుత్వ భూములపై కన్నేశారు. అదును చూసి చదును చేస్తున్నారు. జిల్లా కేంద్రంలోని రాజీవ్‌నగర్ 345 సర్వే నంబరులో ప్రభుత్వ భూమి ఎకరానికిపైగా ఉండగా, దానిని ఇటీవల రాత్రికి రాత్రే చదును చేశారు. ఇందిరమ్మ ఇళ్లను ఆనుకుని ఉన్న ఈ భూమికి ఎటువంటి రక్షణ లేకపోవడం, రాత్రి సమయంలో ఎవరూ అడ్డుకునేవారు లేకపోవడంతో చదును చేసి, హద్దులు పెడుతున్నారు. అదేవిధంగా గత నెలలో జిల్లా కేంద్రంలోని ఎడ్లవాడలో గల మున్సిపల్‌కు చెందిన ప్రభుత్వ బావిని పూడ్చి చదును చేశారు. జిల్లా కేంద్రంలో భూముల విలువ రోజురోజుకూ పెరిగి పోతుండడంతో కబ్జాదారులు ఖాళీ ప్రభుత్వ జాగాల్లో పాగా వేసేందుకు ప్రయత్నిస్తున్నారు. కొంతమంది స్థానిక ప్రజాప్రతినిధులు కబ్జాదారులకు సహకరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో కబ్జాదారులపై చర్యలకు అధికారులు వెనుకాడుతున్నారని తెలుస్తోంది.

చర్యలు తీసుకుంటాం



మంచిర్యాల మున్సిపాలిటీ పరిధిలోని మున్సిపల్ స్థలాలను కబ్జా చేయకుండా తగిన చర్యలు తీసుకుంటున్నాం. ఎడ్లవాడలో ప్రభుత్వ బావిని పూడ్చి, చదును చేసినట్లు ఫిర్యాదు రావడంతో కబ్జా చేస్తే చర్యలు తప్పవని హెచ్చరిస్తూ ఫ్లెక్సీ ఏర్పాటు చేశాం. ప్రభుత్వ భూములను రక్షించేందుకు రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల సమన్వయంతో చర్యలు తీసుకుంటాం. – మారుతి ప్రసాద్, మంచిర్యాల మున్సిపల్ కమిషనర్

విలువైన భూములపై కన్ను

జిల్లా కేంద్రంలో భూములు అత్యధిక ధర పలుకుతున్నాయి. ఇప్పటికే టూటౌన్ పరిధిలోని ప్రభుత్వ భూములు చాలా వరకు కబ్జా అయ్యాయి. అక్కడక్కడ మిగిలి ఉన్న కొన్ని భూములకు ఎలాంటి రక్షణ లేకపోవడంతో ఎన్నికల వేళ అన్యాక్రాంతమవుతున్నాయి. పట్టణంలోని ఖాళీ స్థలాలను ఆక్రమించేందుకు అవకాశం లేకపోవడంతో, గతంలో మున్సిపల్ ఆధ్వర్యంలో 60 చదరపు గజాలలో నిర్మించిన సర్కారు బావుల స్థలాలపై అక్రమార్కుల కన్నుపడింది. మున్సిపాలిటీలో మంచినీటితోపాటు, ఇతరత్రా నీటి అవసరాలు తీర్చడానికి 15 వరకు సర్కారు బావులను తవ్వించి వినియోగించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ఇంటింటికీ నల్లా కనెక్షన్లు రావడం, బావుల స్థానంలో వార్డుల్లో పబ్లిక్ బోర్‌వెల్ వేసి, మోటారు ఆన్ చేస్తే చాలు ఇంట్లోకి నీరు వచ్చేలా ఏర్పాటు చేశారు. దీంతో సర్కారు బావులు వినియోగంలో లేకుండా పోయాయి. ఇదే అదునుగా బావులను పూడ్చేసి 60 గజాల స్థలాన్ని కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. కాపాడాల్సిన అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి.

గల్ఫ్ బోర్డు హామీ ఇచ్చిన వారికే మద్దతు

- గల్ఫ్ కార్మికుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భూమన్న



సమావేశంలో అభివాదం చేస్తున్న భూమన్న

జన్నారం: గల్ఫ్ కార్మికుల సంక్షేమం కోసం గల్ఫ్ బోర్డు ఏర్పాటు చేసి, రూ.500 కోట్లు కేటాయిస్తామని హామీ ఇచ్చిన పార్టీకే గల్ఫ్ కార్మికులందరూ మద్దతు తెలపాలని తెలంగాణ గల్ఫ్ కార్మికుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కల్లెడ భూమన్న సూచించారు. జన్నారంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. దుబాయ్, బొగ్గుబాయి, బొంబాయి అంటూ గల్ఫ్ కార్మికులను ఆదుకునేందుకు గల్ఫ్ బోర్డు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చిన సీఎం కేసీఆర్ మోసం చేశారని ఆరోపించారు. ఉపాధికోసం గల్ఫ్ దేశాలకు వెళ్లిన కార్మికులు వివిధ కారణాలతో అర్థంతరంగా చనిపోతున్నారని తెలిపారు. దీంతో వారి కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గల్ఫ్ సంక్షేమం కోసం పథకాలు ప్రవేశపెట్టి ఆదుకునే పార్టీకి మద్దతు తెలుపాలని సంఘం నిర్ణయించిందన్నారు. ఇందులో భాగంగా పలు నియోజకవర్గాల్లో గల్ఫ్ కార్మికులు పోటీలో నిలబెట్టామని తెలిపారు. ఇటీవల బీఆర్ఎస్ పార్టీ ప్రవేశ పెట్టిన మేనిఫెస్టోలో గల్ఫ్ కార్మికుల ఊసెత్తకపోవడం దారుణమన్నారు. కాంగ్రెస్ పార్టీ గల్ఫ్ సంక్షేమానికి కట్టుబడి ఉన్నట్లు హామీ ఇచ్చిందన్నారు. బీజేపీ కూడ గల్ఫ్ కార్మికుల గురించి ప్రస్తావన తెచ్చారని పేర్కొన్నారు. సంఘం ఈ విషయంలో ఆలోచించి ఏ పార్టీకి మద్దతు ఇవ్వాలో త్వరలో ప్రకటిస్తామన్నారు. సమావేశంలో తెలంగాణ గల్ఫ్ కార్మికుల సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అమరగొండ తిరుపతిగౌడ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లికార్జున్, వర్కింగ్ ప్రెసిడెంట్ గోపాల్, నాయకులు హసన్, మహేశ్, రఫీక్, అంజన్న పాల్గొన్నారు.



మంచిర్యాలలోని ఓ పెళ్లిలో..



జన్నారంలో ఓ పెళ్లిలో..

వన్డే వరల్డ్ కప్ తుది సమరం నేపథ్యంలో జిల్లా అంతటా క్రికెట్ ఫీవర్ నెలకొంది. ఆదివారం పెళ్లి ముహూర్తం ఉండడంతో ఒకవైపు పెళ్లిళ్లు జరుగుతుండగా, ఫంక్షన్ హాళ్లలో టీవీ స్క్రీన్‌లపై క్రికెట్ మ్యాచ్ కూడా వీక్షిస్తూ కనిపించారు. దీంతో అంతా పెళ్లి చూడటంతో పాటు ఎల్‌ఈడీ తెరలపై క్రికెట్ చూస్తూ ఎంజాయ్ చేశారు. బార్లు, హోటళ్లలో కూడా తెరలు ఏర్పాటు చేశారు. మందుబాబులు ఫైనల్ క్రికెట్ మ్యాచ్ చూస్తూ విందులతో ఎంజాయ్ చేశారు. – మంచిర్యాలరూరల్(హాజీపూర్)/జన్నారం

క్లుప్తంగా

కోడి పందెంరాయుళ్ల అరెస్టు

భీమిని: కన్నెపెల్లి మండలం మెట్‌పల్లి శివారులో కోడి పందెం నిర్వహిస్తున్న ముగ్గురిని కన్నెపెల్లి ఎస్సై నరేశ్ అరెస్టు చేశారు. పక్కా సమాచారంతో ఆదివారం దాడి చేసి ముగ్గురి పట్టుకున్నామన్నారు. వారి వద్ద నుంచి రూ.2,050 నగదుతోపాటు ఒక కోడిపుంజు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

నేరడిగొండ: మండలంలోని లఖంపూర్ బస్టాండ్ సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కేఎన్ఆర్ సంస్థలో పనిచేస్తున్న కూలీ మృతిచెందాడు. వివరాల్లోకి వెళితే.. వారం రోజుల క్రితం కర్ణాటక రాష్ట్రంలోని గుల్‌బర్గాలోని చిత్తపూర్ గ్రామానికి చెందిన హన్మంతు (28) పనుల కోసం జిల్లాకు వచ్చాడు. ఈ క్రమంలో మండలంలోని లఖంపూర్ బస్టాండ్ ఎదురుగా జాతీయ రహదారిపై పనులు నిర్వహిస్తుండగా ఆదిలాబాద్ నుంచి హైదరాబాద్ వెళ్తున్న కారు అతివేగం, అజాగ్రత్తగా వచ్చి ఢీకొనడంతో తీవ్ర గాయాల పాలయ్యాడు. క్షతగాత్రుడిని ఎన్‌హెచ్ఏఐ అంబులెన్స్‌లో నిర్మల్ ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడికి భార్య, పిల్లలు ఉన్నారు. శవ పంచనామా నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించనున్నట్లు ఏఎస్సై మారుతి తెలిపారు.

అనారోగ్యంతో యువతి ఆత్మహత్య

సిరికొండ: అనారోగ్యంతో యువతి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని కన్నాపూర్ గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. అజ్మీరా పంతుబాయి, మల్కాస్ దంపతులకు ఆరుగురు కూతుర్లు, నాల్గో కూతురైన శీతల్(19) కొన్నిరోజులుగా పచ్చకామెర్ల వ్యాధితో బాధపడుతోంది. ఇటీవల వ్యాధి తీవ్రం కావడంతో శనివారం మధ్యాహ్నం బయటకు వెళ్లి పురుగుల మందు తాగి ఇంటికి వచ్చి వాంతులు చేసుకుంది. గమనించిన కుటుంబ సభ్యులు రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి ఆదివారం సాయంత్రం మృతి చెందింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

ప్రియాంకాగాంధీ సభకు యూపీ నుంచి..




కాంగ్రెస్ జెండాతో వీరాభిమాని

ఖానాపూర్: ఉత్తరప్రదేశ్‌కు చెందిన కాంగ్రెస్ పార్టీ వీరాభిమాని పండిత్ అనోకోలాల్ తివారీ ఖానాపూర్ మండలంలోని సుర్జాపూర్ ఎన్టీఆర్ చౌరస్తాలో నిర్వహించిన ప్రియాంకాగాంధీ బహిరంగసభలో భారీ జెండాతో కనిపించాడు. ఈ విషయమై అతడిని సంప్రదించగా తాను కాంగ్రెస్ పార్టీ వీరాభిమానినని, ఇప్పటివరకు మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, మిజోరాం, తెలంగాణ ప్రాంతాల్లో జరిగిన రాహుల్‌గాంధీ, ప్రియాంకాగాంధీ సభల్లో పాల్గొని ప్రచారం చేస్తున్నట్లు తెలిపాడు.70 కిలోమీటర్ల దూరం నుంచి పాదయాత్రగా ఖానాపూర్‌కు చేరుకున్నానని వివరించాడు. త్వరలో తెలంగాణలో జరగనున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 80సీట్లు సాధించనున్నట్లు ఆశాభావం వ్యక్తం చేశాడు.

స్వతంత్రుల ప్రభావమెంత..?

- ప్రధాన పార్టీల అభ్యర్థుల్లో గుబులు
- రిజిస్టర్డ్ పార్టీలు, ఇండిపెండెంట్లతో ఓట్లు చీలే అవకాశాలు



బెల్లంపల్లి: జిల్లాలోని మూడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ప్రధాన పార్టీలతో పాటు స్వతంత్ర అభ్యర్థులూ భారీగానే బరిలో ఉన్నారు. తమదైన శైలిలో ప్రచారం చేస్తూ ఓట్లు రాబట్టే ప్రయత్నం చేస్తున్నారు. దీంతో ఏ రాజకీయ పార్టీ అభ్యర్థికి ఎంతమేరకు ఓట్లు గండికొట్టే అవకాశాలు ఉన్నాయనే ఆసక్తికరమైన చర్చ సాగుతోంది. ఒకే సామాజిక వర్గానికి చెందిన అభ్యర్థులు బరిలో ఉండడంతో బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులకు మింగుడు పడని సమస్యగా మారింది. జిల్లాలో మంచిర్యాల, చెన్నూర్(ఎస్సీ), బెల్లంపల్లి(ఎస్సీ) అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. ఈసారి పోటీ తీవ్రంగా ఉండడంతో కొద్దిపాటి ఓట్ల ఆధిక్యంతోనైనా విజయం సాధించవచ్చనే ధీమాతో ఉన్న అభ్యర్థుల ఆశలపై స్వతంత్రులు నీళ్లు చల్లుతున్నారు. నామినేషన్ల ఉపసంహరణ గడువు వరకు స్వతంత్రులు, రిజిస్టర్డ్ పార్టీల అభ్యర్థులను బుజ్జగించి పోటీ నుంచి తప్పుకునేలా పావులు కదపడంలో నిర్లక్ష్యం చేయడంతో పోటీ తీవ్రమైంది.

అసంతృప్తులు.. పార్టీ ఫిరాయింపులు

ఎన్నికల్లో ప్రధాన రాజకీయ పార్టీల అభ్యర్థులు అనేక సవాళ్లు ఎదుర్కొంటున్నారు. సొంత పార్టీలో నాయకుల మధ్య తీవ్రమైన అసంతృప్తి నెలకొనగా.. ఆయా నియోజకవర్గాలకు చెందిన ద్వితీయ శ్రేణి నాయకులు, ముఖ్య కార్యకర్తలు అలకలు బూనడంతో బుజ్జగించడం అభ్యర్థులకు కష్టతరంగా మారింది. మరోవైపు శ్రేణుల పార్టీ ఫిరాయింపులు తలనొప్పి కలిగిస్తున్నాయి. అనేక మంది కండువాలు మార్చుతున్నారు. వీరితోపాటు స్వతంత్ర అభ్యర్థులు చెమటలు పట్టిస్తున్నారు. ఒకే సామాజిక వర్గం అభ్యర్థులు పోటీలో ఉన్నచోట ఓట్లు చీలి ప్రత్యర్థులకు ప్రయోజనం కలిగించే అవకాశాలు లేకపోలేదని పరిశీలకులు చర్చిస్తున్నారు.

పోటీలో రిజిస్టర్డ్ పార్టీలు.. స్వతంత్రులు

జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో 44మంది బరిలో ఉన్నారు. మంచిర్యాల నియోజకవర్గంలో 17 మంది, చెన్నూర్‌లో 14 మంది, బెల్లంపల్లిలో 13 మంది అభ్యర్థులు తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. ఎన్నికల సంఘం వద్ద గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు, రిజిస్టర్డ్ పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులు ఉన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ, బీఎస్పీ గుర్తింపు కలిగి ఉండడంతో ఆయా పార్టీల అభ్యర్థులకు కారు, చేయి, కమలం, ఏనుగు గుర్తులను కేటాయించారు. రిజిస్టర్డ్ పార్టీల అభ్యర్థులు, స్వతంత్రులకు ఎన్నికల నియమావళిని అనుసరించి రకరకాల గుర్తులను కేటాయించారు.

మంచిర్యాలలో..

మంచిర్యాల అసెంబ్లీ నియోజకవర్గంలో 17 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. వీరిలో బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ, బీఎస్పీ, రిజిస్టర్డ్ పార్టీలైన ధర్మసమాజ్ పార్టీ, విద్యార్థుల రాజకీయపార్టీ, బహుజన రిపబ్లికన్ సోషలిస్టు పార్టీ(ఇండియా), ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్, గుర్తింపు పొందిన, రిజిస్టర్ పార్టీల అభ్యర్థులను మించి ఏకంగా 9 మంది స్వతంత్ర అభ్యర్థులు పోటీలో ఉన్నారు.

చెన్నూర్‌లో..

చెన్నూర్ నియోజకవర్గంలో 14 మంది అభ్యర్థులు ఎన్నికల పోరులో ఢీకొంటున్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ, బీఎస్పీ, రిజిస్టర్డ్ పార్టీలైన ధర్మ సమాజ్ పార్టీ, ప్రజారాజ్య సమితి పార్టీ, ఆల్ ఇండియా ఎంపవర్‌మెంట్ పార్టీ, బహుజన్ ముక్తిపార్టీ, సోషలిస్టు పార్టీ(ఇండియా), తెలంగాణ రాజ్య సమితి పార్టీ, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ, మరో ముగ్గురు స్వతంత్ర అభ్యర్థులు పోటీలో ఉన్నారు.

బెల్లంపల్లిలో..

బెల్లంపల్లి నియోజకవర్గం నుంచి 13 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ, బీఎస్పీ, రిజిస్టర్డ్ పార్టీలు, ఇండిపెండెంట్ అభ్యర్థులు ఎన్నికలు ఎదుర్కొంటున్నారు. రిజిస్టర్డ్ పార్టీలు సీపీఐ(ఎంఎల్) రెడ్‌స్టార్, ధర్మ సమాజ్‌పార్టీ, బహుజన్ ముక్తి పార్టీ, సోషలిస్టు పార్టీ(ఇండియా), భారత చైతన్య యువజన పార్టీ, రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా అభ్యర్థులు తలపడుతున్నారు. స్వతంత్ర అభ్యర్థులుగా మరో ముగ్గురు పోటీలో నిలిచారు.

మంచిర్యాల జిల్లాలో పోటీలో ఉన్న అభ్యర్థుల వివరాలు

నియోజకవర్గం	గుర్తింపు పొందిన పార్టీల అభ్యర్థులు	రిజిస్టర్డ్ పార్టీల అభ్యర్థులు	స్వతంత్ర అభ్యర్థులు
మంచిర్యాల	04	04	09
చెన్నూర్	04	07	03
బెల్లంపల్లి	04	06	03

మీకు తెలుసా?

- మంచిర్యాలలో అత్యధిక మెజార్టీతో గెలిచిన ఎమ్మెల్యే



మంచిర్యాలఅర్బన్: లక్సెట్టిపేట్ నుంచి మంచిర్యాల నియోజకవర్గ ఆవిర్భావం వరకు అత్యధిక మెజార్టీతో గెలిచిన ఎమ్మెల్యేగా గడ్డం అరవిందరెడ్డి రికార్డు దక్కించుకున్నారు. 1952 నుంచి 2018 వరకు జరిగిన శాసనసభ ఎన్నికల్లో ఇప్పటి వరకు అరవిందరెడ్డి 78,047 ఓట్ల మెజార్టీతో ముందు వరుసలో నిలిచారు. 2010 ఉప ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి గోనె హన్మంతరావుకు 17,264 ఓట్లు, టీఆర్ఎస్‌కు 95,311 ఓట్లు రాగా 78,047 ఓట్లతో ఆధిక్యత చాటుకున్నారు. 1952లో జరిగిన ఎన్నికల్లో లక్సెట్టిపేట్ నియోజకవర్గంలో విశ్వనాథరావు, కోదాటి రాజమల్లు, 1957, 1962లో జీవీ పితంబరావు, 1967, 1972లో జెవీ నర్సింగరావు, 1974(ఉ.ఎ) కేవీకె రావు, 1978లో చుంచు లక్ష్మయ్య, 1983లో మురళీమనోహరరావు, 1985, 1989లో జీవీ సుధాకర్‌రావు, 1994లో గోనె హన్మంతరావు, 1999, 2004లో దివాకర్ రావు గెలుపొందారు. మంచిర్యాల నియోజకవర్గంలో 2009లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి దివాకర్‌రావుపై టీఆర్ఎస్ అభ్యర్థి గడ్డం అరవిందరెడ్డి 13,827 ఓట్ల మెజార్టీ సాధించారు. తెలంగాణ ఉద్యమ నేపథ్యంలో అరవిందరెడ్డి శాసనసభ సభ్యత్వానికి రాజీనామా చేశారు. 2010లో ఉప ఎన్నిక రాగా అరవిందరెడ్డి 78,047 మెజార్టీ సాధించారు. ఇప్పటి వరకు నాలుగు దఫాలు గెలిచిన దివాకర్‌రావు విజయబావుటా ఎగురవేశారు.

నోటాపై నొక్కుతున్నారు..!

- ఉమ్మడి జిల్లాలో 37,360 ఓట్లు



భైంసాటౌన్/ఇచ్చోడ: నన్ ఆఫ్ ది ఎబోవ్‌కు సంక్షిప్త రూపం నోటా.. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు నచ్చకపోతే ఓటరు తన ఓటు వేయడానికి ఆసక్తి చూపడు. దీంతో ఓటింగ్ శాతంపై ప్రభావం పడుతుందని గుర్తించిన ఎన్నికల సంఘం నోటాను ప్రవేశపెట్టింది. 2013 నుంచి ఇది అమలులోకి రాగా తెలంగాణలో 2014, 2018 ఎన్నికల్లో ఓటర్లు నోటాను విస్తృతంగా వినియోగించుకున్నారు. ఈవీఎంపై పోటీలో ఉన్న అభ్యర్థుల పార్టీ గుర్తులతో పాటు నోటా బటన్ సైతం అందుబాటులో ఉంచారు. అభ్యర్థుల్లో ఎవరికీ ఓటు వేయదల్చుకోకపోతే నోటాకు వేసేందుకు అవకాశం కల్పించింది. నోటాను ప్రవేశపెట్టినప్పటి నుంచి పలుమార్లు ఎన్నికలు జరిగాయి. ఈ క్రమంలో ప్రతీ ఎన్నికల్లో నోటాకు ఓట్లు పెరుగుతున్నాయే తప్ప తగ్గడం లేదు. నోటా అమలులోకి వచ్చిన తరువాత 2014, 2018 అసెంబ్లీ ఎన్నికల్లో కలిపి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 37,360 మంది నోటాకు ఓటేశారు. 2014లో 17,109 మంది, 2018లో 20,251 మంది నోటాను వినియోగించుకున్నారు.

2014, 2018 అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో నోటాకు పోలైన ఓట్ల వివరాలిలా..

నియోజకవర్గం	2014	2018
సిర్పూర్	1,756	1,579
చెన్నూర్	1,616	2,135
బెల్లంపల్లి	763	2,598
మంచిర్యాల	1,482	1,394
ఆసిఫాబాద్	2,833	2,715
ఆదిలాబాద్	827	1,149
బోథ్	2,248	2,271
నిర్మల్	1,365	1,367
ముధోల్	1,792	2,267
ఖానాపూర్	2,427	2,776

పార్టీ మారే... పదవి వరించే

• ఓటమి నుంచి పార్లమెంట్‌లోకి అడుగు • మంత్రిగానూ బాధ్యతల నిర్వహణ

కైలాస్‌నగర్: ఎన్నికల్లో గెలుపోటములు ఎంత సహజమో... రాజకీయ నాయకులు ఎప్పుడు ఏ పార్టీలో ఉంటారో.. ఏ పదవిలో ఉంటారనేది కూడా అంతే సహజం. కొంతమంది నాయకులు ఎంతగా ప్రయత్నించినా ఏళ్లుగా పదవి దక్కకుండా దురదృష్టవంతులుగా నిలిస్తే మరి కొంతమంది దురదృష్టాన్ని తమ అదృష్టంగా మార్చుకుని అందలమెక్కుతారు. అందుకనే రాజకీయాల్లో ఎప్పుడు ఏం జరుగుతుందో ఎవరికీ తెలియదని చెబుతుంటారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఇలాంటి కోవకే చెందిన నాయకులున్నారు. తాజా ఎన్నికల్లో మరోసారి అసెంబ్లీ బరిలో తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. వారెవరనేదాన్ని పరిశీలిస్తే....

కండువా మార్చి.. పార్లమెంట్‌లో అడుగిడి



ఎక్సైజ్‌శాఖ అధికారిగా పనిచేసిన బొర్లకుంట వెంకటేష్ నేత తన ఉద్యోగానికి స్వచ్ఛందంగా పదవీ విరమణ చేసి రాజకీయాల్లోకి అడుగుపెట్టాడు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో చెన్నూర్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిత్వాన్ని దక్కించుకుని ఎమ్మెల్యేగా పోటీ చేశాడు. బీఆర్ఎస్ అభ్యర్థి బాల్క సుమన్ చేతిలో 28,132 ఓట్ల తేడాతో ఓటమిపాలయ్యాడు. మరుసటి ఏడాది జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌లో చేరి పెద్దపల్లి ఎంపీగా పోటీ చేసిన ఆయన కాంగ్రెస్ అభ్యర్థి చంద్రశేఖర్‌పై 95,180 ఓట్ల అధిక్యంతో విజయం సాధించి పార్లమెంట్‌లోకి అడుగుపెట్టాడు.

పార్టీ మారారు.. మంత్రి అయ్యారు



జిల్లా రాజకీయాల్లో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడైన అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి జెడ్పీ చైర్మన్, ఎంపీ, ఎమ్మెల్యేగా సేవలందించాడు. మారిన రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో 2014లో బీఎస్పీ తరఫున అసెంబ్లీ బరిలో నిలిచిన ఆయన బీఆర్ఎస్ అభ్యర్థి శ్రీహరిరావుపై 8497 ఓట్ల అధిక్యంతో ఎమ్మెల్యేగా విజయం సాధించాడు. మరుసటి ఏడాది బీఎస్పీకి గుడ్‌బై చెప్పి మరో ఎమ్మెల్యే కోనేరు కోనప్పతో కలిసి అధికార బీఆర్ఎస్‌లో చేరారు. పార్టీలో చేరిన కొంత కాలానికే రాష్ట్ర దేవాదాయ, న్యాయ, గృహ నిర్మాణ శాఖ మంత్రిగా పదవి చేపట్టారు. స్వరాష్ట్రంలో ఆ శాఖల బాధ్యతలను నిర్వహించిన తొలి మంత్రిగా ఘనత దక్కించుకున్నాడు.

అసెంబ్లీకి ఓడి.. అనూహ్యంగా గెలిచి



బోథ్ నియోజకవర్గం నుంచి ఓసారి అసెంబ్లీకి ప్రాతినిధ్యం వహించిన సోయం బాపూరావు 2018 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున ఎమ్మెల్యేగా పోటీ చేశారు. ఆ ఎన్నికల్లో అధికార బీఆర్ఎస్ అభ్యర్థి రాథోడ్ బాపూరావు చేతిలో 6,486 స్వల్ప ఓట్ల తేడాతో పరాజయం పాలయ్యాడు. అనంతరం ఆ పార్టీకి గుడ్‌బై చెప్పి 2019 మార్చి 15న బీజేపీలో చేరాడు. ఆ పార్టీ తరఫున అదే ఏడాది జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేసిన సోయం, అధికార బీఆర్ఎస్ అభ్యర్థి గోడం నగేష్‌పై 58,560 ఓట్ల అధిక్యంతో విజయం సాధించాడు. బీజేపీ తరఫున పార్లమెంట్‌కు ఎన్నికైన తొలి ఎంపీగా ఆయన రికార్డు సృష్టించాడు.

మద్యం పట్టివేత



పట్టుకున్న మద్యం బాటిళ్లు

బెల్లంపల్లి: ఓ యువకుడు తన ఇంటి వద్ద అక్రమంగా నిర్వహిస్తున్న బెల్ట్ షాపునకు తీసుకువెళ్తున్న మద్యం బాటిళ్లను బెల్లంపల్లి పోలీసులు పట్టుకున్నారు. వన్‌టౌన్ ఎస్‌హెచ్ఓ బన్సీలాల్ కథనం ప్రకారం.. మండలంలోని బుగ్గగూడెం గ్రామానికి చెందిన కందుల నల్లందుల రాజేష్ బెల్లంపల్లి నుంచి మద్యం బాటిళ్లను తన ఇంటికి తీసుకెళ్తుండగా పాతబస్టాండ్ చౌరస్తా వద్ద ఆదివారం వాహనాల తనిఖీ చేస్తున్న పోలీసులకు పట్టుబడ్డాడు. నిందితుడి వద్ద నుంచి 60 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.4,800 ఉంటుందని తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్ఓ తెలిపారు.

కాగజ్‌నగర్‌టౌన్: ఎన్నికల నేపథ్యంలో పట్టణంలోని తిరందాస్ కాలనీలో ఆదివారం ఎక్సైజ్ అధికారులు దాడులు చేశారు. ఉమాజీ ఇంట్లో తనిఖీ చేయగా 14 యునైటెడ్ గోల్డ్ విస్కీ (180 ఎంఎల్) బాటిళ్లు లభించినట్లు ఎక్సైజ్ సీఐ మంగమ్మ తెలిపారు. జిల్లా ఎక్సైజ్ అధికారి జ్యోతి కిరణ్ ఆదేశాలతోనే దాడులు చేసినట్లు పేర్కొన్నారు. పట్టుకున్న మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకోవడంతోపాటు సదరు వ్యక్తిపై కేసు నమోదు చేశామన్నారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్సై కిషన్, సిబ్బంది ఉన్నారు.

'విశ్రాంత కార్మికుల సమస్యలను మేనిఫెస్టోలో చేర్చాలి'



మాట్లాడుతున్న సింగరేణి విశ్రాంత ఉద్యోగులు

పాతమంచిర్యాల: సింగరేణిలోవిశ్రాంత కార్మికుల సమస్యలపై రాజకీయ పార్టీలు మేనిఫెస్టోలో చేర్చాలని సింగరేణి కాలరీస్ రిటైర్డ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని హైటెక్‌సిటీ కాలనీలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో జిల్లా అధ్యక్షుడు గజెల్లి వెంకటయ్య, గౌరవ అధ్యక్షుడు రాళ్లబండి రాజన్న మాట్లాడారు. ప్రభుత్వ ఉద్యోగులకు రిటైరైన తర్వాత డీఏ, ఆరోగ్య బీమా కల్పిస్తామని రాజకీయ పార్టీలు హామీ ఇస్తున్నారే కానీ సింగరేణి విశ్రాంత కార్మికులను పట్టించుకోవడం లేదన్నారు. తమకు తెల్లరేషన్ కార్డులు ఇవ్వాలని, ఆరోగ్యశ్రీ కార్డు, సొంతింటి నిర్మాణం కోసం 200 గజాల స్థలం, రూ.15 లక్షల వడ్డీలేని రుణం ఇవ్వాలని కోరుతూ రాజకీయ పార్టీల నాయకులకు ఈ–మెయిల్ ద్వారా వినతిపత్రాలు పంపించామన్నారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు బైరి లక్ష్మీనారాయణగౌడ్, కార్యదర్శులు రామోజు రమేశ్, బూర్ల జ్ఞానీ, ముఖ్య సలహాదారు బోడ రాజమౌళి, నాయకులు పూదరి నర్సయ్య, గుండా సుధాకర్, విజ్ఞేష్, బానయ్య, నారాయణరావు, లక్ష్మణ్, బాలమల్లయ్య పాల్గొన్నారు.

ఉదయం కాంగ్రెస్.. సాయంత్రం బీఆర్ఎస్‌లోకి



కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న వినోద్



గులాబీ కండువా కప్పుతున్న నాయకులు

నెన్నెల: ఎన్నికల సమయంలో నేతలు గంటల వ్యవధిలో పార్టీలు మారుతున్నారు. నెన్నెల మండలం మెట్‌పల్లికి చెందిన ఉప సర్పంచ్ జాడి జ్యోతి, వార్డు సభ్యురాలు బోర్ల అరుణ ఆదివారం ఉదయం కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వినోద్ సమక్షంలో పార్టీలో చేరారు. సాయంత్రం మెట్‌పల్లిలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు రాంచందర్, సర్పంచ్ శివప్రసాద్ ఆధ్వర్యంలో గులాబీ కండువా కప్పుకుని సొంత గూటికి చేరారు. నేతల ఒత్తిడితో పార్టీ మారారని ఇరు పార్టీల నేతలు ఆరోపించుకుంటున్నారు.

డిస్మిస్ కార్మికులపై పట్టింపేది?

- 7,112 రోజులుగా కొనసాగుతున్న దీక్ష
- అవకాశం ఇవ్వాలని వేడుకోలు



దీక్షలో పాల్గొన్న డిస్మిస్ కార్మిక కుటుంబాలు (ఫైల్)

మందమర్రిరూరల్(చెన్నూర్): సింగరేణిలో ఉద్యోగం చేస్తూ అనారోగ్య, ఇతర కారణాలతో గైర్హాజరైన కార్మికులను యాజమాన్యం విధుల నుంచి తొలగించింది. దీంతో కార్మికులు ఉపాధి కోల్పోయి వేలాది కుటుంబాలు వీధినపడ్డాయి. జీవనోపాధి కరువై కార్మికులు ఆత్మహత్య చేసుకున్న సంఘటనలు అనేకం ఉన్నాయి. ఆంధ్రా అధికారులు సింగరేణిలో నూతన నిబంధనలు అమలు చేసి కార్మికులను తొలగించారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడితే అవకాశం వస్తుందని ఎదురుచూసిన డిస్మిస్ కార్మికులకు నిరాశే మిగిలింది. అందరికి తిరిగి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని చెప్పిన ఎన్నికైన గుర్తింపు కార్మిక సంఘాలు సంస్థకు అనుకూలమైన నిబంధనలతో కొందరికి మాత్రమే ఉద్యోగ అవకాశం కల్పించి మిగితా వారికి అన్యాయం చేశారు. ఇది అన్యాయమని కొందరు డిస్మిస్ కార్మికులు కోర్టుకు వెళ్లారు. వారిని డిస్మిస్ చేయడం చట్ట విరుద్ధమని, తిరిగి వేతనంతో కూడిన ఉద్యోగం కల్పించాలని తీర్పు వెలువరించిన కేసులు అనేకం ఉన్నాయి.

దీక్షలో నిరసనలు

డిస్మిస్ కార్మికులకు తిరిగి ఉద్యోగ అవకాశం కల్పించాలని మందమర్రిలో చేపట్టిన దీక్షలు 7,112 రోజులుగా కొనసాగుతున్నాయి. దీక్షలో భాగంగా నిరసనలు చేపట్టారు. అన్ని పార్టీలు, కార్మిక సంఘాల నాయకులు దీక్షాశిబిరాన్ని సందర్శించి మద్దతు తెలపడమే తప్ప పూర్తిస్థాయిలో వారికి న్యాయం చేయలేకపోతున్నారు. గెలిచిన కార్మిక సంఘాలు మాత్రం యాజమాన్యానికి అనుకూలంగా వ్యవహరిస్తున్నాయి. గతంలో సంస్థ నష్టాల్లో ఉందని తొలగించినవారిని, ప్రస్తుతం కోట్ల లాభాల్లో నడుస్తున్నా ఎందుకు తిరిగి ఉద్యోగంలోకి తీసుకోవడం లేదని డిస్మిస్ కార్మికులు ప్రశ్నిస్తున్నారు. ఎన్నికల వేళ, రాష్ట్ర ఉద్యమ సమయంలో తమ సేవలు వినియోగించుకుని నాయకులు గెలిచాక, ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని మండిపడుతున్నారు. సంస్థలో కొంత కాలం పనిచేశాక అనారోగ్యం పాలు కావడంతో విధులకు గైర్హాజరు కావాల్సి వచ్చిందని, ఆ సమయంలో సంస్థ వేతనాలు చెల్లించలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అందరికీ ఒక అవకాశం కల్పించాలని వేడుకుంటున్నారు.

ఇబ్బంది పడుతున్నాం



సింగరేణి కార్మికులను గైర్హాజర్ పేరిట యాజమాన్యం తొలగించింది. ఇది అన్యాయం. తిరిగి ఉద్యోగంలోకి తీసుకోవాలని మందమర్రిలో 7,112 రోజులుగా దీక్ష చేస్తున్నాం. దీక్ష ఫలితంగా కొన్నేళ్ల క్రితం సంస్థ పలు షరతులు విధించి కొందరిని తిరిగి ఉద్యోగంలోకి తీసుకుంది. చాలామందికి ఉద్యోగ అవకాశం రాక జీవనోపాధి కరువై ఇబ్బంది పడుతున్నాం. యాజమాన్యం, ప్రభుత్వం ఇప్పటికైనా పట్టించుకోవాలి.

– బీనవోయిన రవీందర్, డిస్మిస్ కార్మిక సంఘం అధ్యక్షుడు, మందమర్రి

డిస్మిస్ చేయడం చట్టవిరుద్ధం



సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగిని డిస్మిస్ చేయడం చట్టవిరుద్ధం. సింగరేణిలో సర్క్యులర్ తయారు చేసి గైర్హాజర్ పేరిట వేలాది మంది కార్మికులను తొలగించారు. వారిని ఉద్యోగంలోకి తీసుకోవాలి. ఈ సమస్యపై అన్ని కార్మిక సంఘాలు ఏకం కావాల్సిన అవసరం ఉంది.

– పార్వతి రాజిరెడ్డి, హెచ్ఎంఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు, మందమర్రి